సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 13 । ఫిబ్రవరి । 2025





## నాట్య మయూరి..!

నగరానికి చెందిన యామిని కూచిపూడిలో సత్తాచాటుతున్నారు. 500లకు పైగా ప్రదర్శనలు ఇచ్చి అనేక పురస్కారాలు అందుకున్నారు.

- 8లో



## వ్యాక్సిన్ల కొరత

టెక్కలి రూరల్ : టెక్కలిలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారుల వ్యాక్సిన్ల కొరత వేధిస్తోంది. దీంతో తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా కురసాల కన్నబాబు



వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్‌గా మాజీ మంత్రి కురసాల కన్నబాబు నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈయన ప్రస్తుతం కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఉన్నారు.

## న్యూస్‌రీల్

### ఆర్ట్స్ కళాశాల మైదానంలో తండేల్ సక్సెస్ మీట్ నేడు



మాట్లాడుతున్న నిర్మాత బన్నీవాసు, కార్తీక్

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల(ఆర్ట్స్) మైదానంలో గురువారం సాయంత్రం 5 గంటలకు తండేల్ చిత్రం సక్సెస్ మీట్ నిర్వహిస్తున్నట్లు నిర్మాత బన్నీవాసు తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలుత ఎన్టీఆర్ మున్సిపల్ మైదానంలో వేడుక నిర్వహించేందుకు ప్రయత్నించామని, అధిక సంఖ్యలో అభిమానులు వచ్చే అవకాశం ఉండడంతో ఆర్ట్స్ కళాశాల మైదానానికి మార్చామని చెప్పారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రెండు ప్రొఫెషనల్ ఏజెన్సీలు, పోలీసు బృందాలతో కలిసి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వేడుకకు హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవితో పాటు చిత్రం యూనిట్ మొత్తం హాజరవుతుందని పేర్కొన్నారు. పాకిస్తాన్ చెర నుంచి విడుదలైన మత్స్యకారులను ఆహ్వానించామని చెప్పారు. సక్సెస్ మీట్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కథ రచయిత తీడ కార్తీక్ పాల్గొన్నారు.

### నీలమణి దుర్గ ఆదాయం రూ.5.89 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాతపట్నంలో కొలువైన నీలమణిదుర్గ అమ్మవారి హుండీ కానుకల ఆదాయం రూ.5,89,324 వచ్చిందని ఈవో టి.వాసుదేవ రావు చెప్పారు. సహాయ కమిషనర్ కార్యాలయం దేవదాయ శాఖ అధికారి జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో బుధవారం హుండీ లెక్కింపు చేపట్టగా.. 38 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### పక్కాగా పంట వివరాల నమోదు

పొందూరు: రబీ సాగులో వ్యవసాయ సిబ్బంది పంట నమోదు వివరాలను సక్రమంగా నమోదు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఆదేశించారు. పొందూరు మండలం తోలాపి, కనిమెట్ట గ్రామాల్లో సూపర్‌చెక్ కార్యక్రమంలో భాగంగా పలు పంటలను పరిశీలించారు. మండల వ్యవసాయాధికారులు, సచివాలయ వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంట భూముల్లోకి వెళ్లి వివరాలు సేకరించాలన్నారు. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందాలంటే పంట నమోదు వివరాలు సక్రమంగా ఉండాలని స్పష్టం చేశారు. జేసీతో పాటు జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి, ఏడీ శ్రీనివాసరావు, ఏవో బెండి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

# అసలు కథ చెప్పని తండేల్

"వైఎస్ జగన్ మాకు పునర్జన్మ ఇచ్చారు. చావు అంచుల వరకు వెళ్లిన మమ్మల్ని దేవుడిలా కాపాడారు. మా కుటుంబాల్లో వెలుగులు నింపారు."

- తండేల్ చిత్రంలో హీరోగా చూపించిన గనగళ్ల రామారావు, ఇతర బాధిత మత్స్యకారులు ఆనాడు చెప్పిన మాటలు

పద్నాలుగు నెలలు పాకిస్తాన్ జైలులో మగ్గిపోయిన 22 మంది మత్స్యకారులను విడుదల చేయించింది ఎవరు?

వారిని వాఘా సరిహద్దుల నుంచి ఇంటి వరకు తీసుకొచ్చింది ఎవరు?

వారి కష్టాలకు చలించిపోయి ఇచ్చిన మాట ప్రకారం రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేసిందెవ్వరు?


ఇకపై ఎవరూ వలస పోకుండా, ఎవరికీ అలాంటి దుస్థితి రాకుండా శ్రీకాకుళం జిల్లాలో పోర్టు, హార్బర్, జెట్టీల నిర్మాణం మొదలుపెట్టింది ఎవరు?

వలస బతుకులకు ఫుల్‌స్టాప్ పెట్టాలని ప్రయత్నించిందెవరు?...

మత్స్యకారుల వలస జీవితం ఇతివృత్తంగా తెరకెక్కించిన 'తండేల్' సినిమా ఈ ప్రశ్నలన్నింటినీ మరోసారి తెర ముందు ఉంచింది. సినిమాలో సగం నిజమే చెప్పినా.., చూపించని కోణాలు ఎన్నో. బాధితులు మాత్రం మీడియా ముందుకు వచ్చి గుండె తెరిచి వాస్తవాలు వివరించారు. తమను విడిపించి తీసుకువచ్చింది, రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేసింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని విస్పష్టంగా చెప్పారు. తరాల తరబడి శ్రీకాకుళం జిల్లాను పాలిస్తున్న రాజకీయ కుటుంబాలు కలలో కూడా ఊహించని విధంగా జిల్లాలో పోర్టు పనులు ప్రారంభించడం, ఫిషింగ్ హార్బర్, జెట్టీ పనులు ప్రారంభించడం వైఎస్ జగన్ చలవేనని సోషల్ మీడియా మోతమోగిపోయేలా చెబుతున్నారు.

- సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం






### ఇదీ జరిగింది..

ఎచ్చెర్ల మండలం డి.మత్స్యలేశంకు చెందిన 10 మంది, బడివానిపేటకు చెందిన ముగ్గురు, ముద్దాడకు చెందిన ఒకరు, విజయనగరం జిల్లా తిప్పలవలసకు చెందిన ఆరుగురు, తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఇద్దరు ఇలా మొత్తం 22 మంది మత్స్యకారులు చేపల వేట కోసం 2018 జూలైలో గుజరాత్ రాష్ట్రం వీరావల్‌కు వెళ్లారు. వీరంతా ఒక బృందంగా ఏర్పడి నాలుగు పడవల్లో అరేబియా సముద్రంలోకి వెళ్లారు. సముద్రంలో తీవ్ర ఆటుపోట్లకు గురవడంతో పొరపాటుగా పాకిస్తాన్ ప్రాదేశిక జలాల్లోకి ప్రవేశించారు. 2018 నవంబర్ 28న అక్కడి కోస్టు గార్డు అధికారులకు దొరికిపోయారు. పాకిస్తాన్ అధికారులు వారందరినీ కరాచీ సబ్ జైలులో పెట్టారు. అక్కడ సరైన తిండి, దుస్తులు లేక వారు పడ్డ అవస్థలు వర్ణనాతీతం. జైలు అధికారులు ఉదయం ఒక్క రొట్టె ఇచ్చేవారు. మధ్యాహ్నం, రాత్రి రెండేసి రొట్టెలు ఇచ్చేవారు. వాటితోనే సరిపెట్టుకోమని చెప్పేవారు. రొట్టెలు వద్దంటే అన్నం ఇచ్చేవారు. ఆదివారం మాత్రం కొంచెం మాంసాహారం పెట్టేవారు. ఈద్ అనే స్వచ్ఛంద సంస్థ దుస్తులతో పాటు రూ.5 వేల నగదు ఇచ్చింది. అక్కడ కూలి పనులు చేస్తే కొంత డబ్బు వచ్చేది. ఆ డబ్బుతో జైల్లోనే విక్రయించే కిరాణా సరుకులు కొనుక్కొని వంట చేసుకునేవారు. అదీ అరకొర భోజనమే. ఇలా కష్టాలు అనుభవిస్తూ క్షణమొక యుగంలా గడిపారు. మరోపక్క వేటకు వెళ్లిన వీరి ఆచూకీ తెలియకపోవడంతో ఇక్కడ ఉన్న కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. చివరకు వారితో పాటు వేటకు వెళ్లిన మరో మత్స్యకారుడి ద్వారా వారంతా పాకిస్తాన్ అదుపులో ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ మత్స్యకారుల కుటుంబాలు తమ వాళ్ల కోసం గ్రామ సర్పంచ్ నుంచి ప్రభుత్వ పెద్దల వరకు అందరినీ ఆశ్రయించాయి. ఎవరూ పరిష్కారం చూపలేదు. పాకిస్తాన్‌లో మత్స్యకారులు తిండికి కూడా ఇబ్బంది పడుతున్నారని తెలిసి వారి కుటుంబీకులు తల్లడిల్లిపోయేవారు.

- 2018లో 22 మంది మత్స్యకారులను జైలులో పెట్టిన పాకిస్తాన్
- వారి విడుదలపై పట్టించుకోని అప్పటి ప్రభుత్వ పెద్దలు
- వైఎస్ జగన్ చొరవతోనే పాక్ జైలు నుంచి విడుదల
- విడుదలైన వారికి రూ.5 లక్షలు చొప్పున ఆర్థిక సాయం
- మత్స్యకారుల వలసలు ఆపేందుకు పలు చర్యలు
- సీ పోర్టు, ఫిషింగ్ హార్బర్, జెట్టీ పనులు ప్రారంభం
- సినిమాలో చూపకపోయినా చెప్పాల్సిన బాధ్యత ఉందన్న బాధిత కుటుంబ సభ్యులు

### ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్ హామీ



పాక్ జైలులో ఉన్న మత్స్యకారుల గురించి జగన్‌కు వివరిస్తూ.. (ఫైల్)

ఆ సమయంలో నిండు గర్భిణిగా ఉన్న రామారావు అలియాస్ రాజు సతీమణి నూకమ్మ, బందీగా ఉన్న మరో మత్స్యకారుడు ఎర్రయ్య సతీమణి శిరీష మిగిలిన మత్స్యకారుల కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గ్రామానికి చెందిన న్యాయవాది గురుమూర్తి సాయంతో జిల్లా యంత్రాంగానికి, నాయకులకు, ప్రభుత్వానికి విన్నపాలు అందజేశారు. అయినా ఫలితం లేదు. అదే సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేస్తున్నారు. 2018 డిసెంబర్ 2న రాజాం నియోజకవర్గం లచ్చయ్యపేట గ్రామం వద్దకు వచ్చిన వైఎస్ జగన్‌ను బాధిత మత్స్యకార కుటుంబాలు కలిశాయి. పాకిస్తాన్ జైల్లో బందీలుగా ఉన్న తమ వాళ్లను విడిపించాలని కోరాయి. అప్పటి రాష్ట్ర మంత్రి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే కళా వెంకటరావును కలిసినా పట్టించుకోలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ వెంటనే స్పందించారు. పాక్ చెరలో ఉన్న మత్స్యకారుల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. తమ ఎంపీలను పంపిస్తానని, మత్స్యకార కుటుంబ సభ్యులు విదేశాంగ శాఖ మంత్రిని కలిసేలా చేస్తానని చెప్పారు. అధికారంలోకి వస్తే వెంటనే విడిపిస్తానని భరోసా ఇచ్చారు.

### రియల్ స్టోరీ




సాక్షిలో ప్రచురితమైన క్లిప్పింగ్స్

1. స్వదేశానికి వచ్చిన మత్స్యకారులు
2. నవ్వినా కన్నీళ్లే.. పేరిట సాక్షిలో వచ్చిన కథనం
3. సొంత గూటికి చేరిన ఆనందంలో మత్స్యకారులు

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి మోపిదేవి, తదితరులతో మత్స్యకారులు

### చెప్పినట్టుగానే హామీలు అమలు

194 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్న శ్రీకాకుళం జిల్లాలో మౌలిక సదుపాయాలు లేక మత్స్యకారులు వలసపోయి, అనేక అవస్థలు పడుతుండేవారు. ఇలాంటి దయనీయ స్థితి నుంచి మత్స్యకారులను గట్టెక్కించడానికి జిల్లాలోని మూలపేటలోనే ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ.2,949.70 కోట్లతో సీ పోర్టు తొలి దశ, బుడగట్లపాలెంలో రూ.366 కోట్లతో ఫిషింగ్ హార్బర్, మంచినీళ్లపేటలో జెట్టీ పనులకూ శ్రీకారం చుట్టారు. అధికారంలో ఉండగానే చాలా వరకు పనులు పూర్తి చేశారు. వేట నిషేధ కాలంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట 17,136 మందికి రూ.10 వేలు చొప్పున సాయం అందజేశారు. మత్స్యకారుల సంక్షేమం క్షేత్రస్థాయిలో అందుతుందో తెలుసుకునేందుకు 66 మంది సాగర మిత్ర ఉద్యోగులను నియమించారు. గ్రామ సచివాలయాల్లో ఫిషరీస్ అసిస్టెంట్ ఉద్యోగులను నియమించారు. ఫిష్ ఆంధ్రా షాపులను ఏర్పాటు చేశారు. కరోనా సమయంలో రూ.3 కోట్లు ఖర్చు పెట్టి గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి జిల్లాకు చెందిన 3,064 మంది మత్స్యకారులను 46 బస్సుల ద్వారా తీసుకొచ్చారు. ఇదంతా కళ్లెదుటే జరిగింది. అయినా ఇందులో ప్రధాన ఘట్టాలను సినిమాలో చూపించలేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వైఎస్ జగన్ ప్రభుత్వం చొరవతో విడుదల

పాదయాత్రలో ఉన్నప్పటికీ, వైఎస్ జగన్ మత్స్యకారుల సమస్య పరిష్కారానికి కృషి చేశారు. దీంతో 2019 ఫిబ్రవరిలో మత్స్యకారుల నుంచి కుటుంబ సభ్యులకు ఉత్తరాలు రావడం మొదలైంది. ఇది కుటుంబ సభ్యులకు కొంత ఉపశమనం కలిగించినా, తిరిగి ఇంటికి వస్తారో, లేదో అన్న భయం వెంటాడుతూనే ఉండేది. 2019లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారుల విడుదలకు కేంద్రంపై ఒత్తిడి మరింతగా పెంచారు. ఆ తర్వాత కేంద్రం 370వ అధికరణం ఎత్తివేయడం, 35 (ఎ)తొలగింపు వంటి పరిణామాలతో వీరి విడుదలపై ఆశలు సన్నగిల్లాయి. అయినా వైఎస్ జగన్ పట్టువిడవకుండా ఎంపీల ద్వారా విదేశాంగ శాఖతో సంప్రదింపులు జరిపారు. దీంతో మత్స్యకారుల విడుదలకు పాకిస్తాన్ ప్రభుత్వం అంగీకరించింది. 2020 జనవరి 6న మత్స్యకారులను విడుదల చేసింది. ఆ రోజు సాయంత్రం 7 గంటల సమయంలో వాఘాలోని భారత్–పాక్ సరిహద్దు వద్ద 20 మంది మత్స్యకారులను అప్పగించింది. వారికి అప్పటి వైఎస్సార్‌సీపీ మంత్రులు, అధికారులు స్వాగతం పలికారు. మిగతా ఇద్దరు డాక్యుమెంట్లు, ఇతర సాంకేతిక కారణాల వల్ల తర్వాత విడుదలయ్యారు. విడుదలైన వారందరినీ వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు ఢిల్లీ తీసుకొచ్చి అక్కడి నుంచి విమానంలో రాష్ట్రానికి తెచ్చారు. వారంతా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. జగన్ వారందరికీ స్వీట్లు తినిపించి, ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఇకపై మత్స్యకారులు ఇలా వలసలు వెళ్లే అవసరం లేకుండా రాష్ట్రంలోనే పోర్టు, జెట్టీ, ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని భరోసా ఇచ్చారు.




### జగన్ పునర్జన్మనిచ్చారు



ఈమె పేరు ముగతమ్మ. తండేల్ సినిమా హీరో పాత్రకు మూలమైన రామారావు సోదరి. ఈమె భర్త అప్పారావు, కొడుకులు కళ్యాణ్, కిషోర్ కూడా అప్పట్లో పాక్ జైల్లో బందీ అయ్యారు. 'తండేల్' సినిమాలో జగన్ ప్రస్తావన లేకపోవడాన్ని చూసి ముగతమ్మ తట్టుకోలేకపోయారు. సినిమా చూసి వచ్చిన వెంటనే హాల్ బయట తన మనసులో మాటను మీడియా ముందు స్పష్టంగా చెప్పారు. తమ వారిని విడిపించి తీసుకువస్తానని చేతిలో చేయి వేసి జగన్ చెప్పారని, చెప్పినట్టుగానే తీసుకుని వచ్చారని తెలిపారు. అంతేకాకుండా ఒక్కొక్కరికీ రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేశారని గుర్తు చేశారు. జగనన్నతో పాటు అప్పటి విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, గ్రామ సర్పంచ్, సర్పంచ్ కుమార్తె, న్యాయవాది గురుమూర్తి కృషి కూడా ఉందని తెలిపారు. సినిమాలో అవేవీ లేకపోయినా బయట చెప్పాల్సిన బాధ్యత తమపై ఉందని, అందుకే అన్ని విషయాలు వివరంగా చెబుతున్నానని పేర్కొన్నారు.

# జీబీఎస్ అరుదైన వ్యాధి

- చిన్నారి యువంత్ మృతిపై డీఎంహెచ్‌ఓ, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం బృందం ఆరా
- కాపుగోదాయవలసలో పర్యటన



యువంత్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం బృందం

సంతబొమ్మాళి: గులియన్ బర్రి సిండ్రోమ్ వ్యాధి (జీబీఎస్) అంటువ్యాధి కాదని అరుదైన వ్యాధి అని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి టి.వి.బాలమురళీకృష్ణ అన్నారు. సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలసకు చెందిన చిన్నారి వాతాపి యువంత్ జీబీఎస్ వ్యాధిబారిన పడి బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందిన నేపథ్యంలో బుధవారం ఎన్‌ఆర్‌హెచ్‌ఎం బృందంతో కలిసి గ్రామంలో పర్యటించారు. చిన్నారి తల్లిదండ్రులు చిరంజీవి, రోజాలను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మొదట గొంతు నొప్పివచ్చిందని నీరు తాగడానికి, ఆహారం తినడానికి ఇబ్బంది పడి మాటకూడా నెమ్మది అయిపోయిందని, విశాఖ, శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం లేకుండా పోయిందని తల్లిదండ్రులు వాపోయారు. అనంతరం అధికారుల బృందం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలను వివరించారు. గొంతునొప్పి, జ్వరం ఉన్న ఆరుగురు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ యువంత్‌కు చికిత్స అందించిన ఆస్పత్రులు ఇచ్చిన డాక్యుమెంట్లు పరిశీలించామని, ఒక్కరే జీబీఎస్ వ్యాధిగా గుర్తించారని, మిగిలిన వారు కన్ఫర్మ్ చేయలేదని చెప్పారు. జీబీఎస్ అరుదైన కేసు అని, ఐదులక్షల్లో ఒకరికి వచ్చే అవకాశముందని, మన రాష్ట్రంలో ఇంతవరకు ఎక్కడా నమోదు లేదని, మహారాష్ట్రలో నమోదైందని వివరించారు. జీబీఎస్ వ్యాధి అయి ఉంటే ఇంత త్వరగా చిన్నారి మృతి చెందడం విచారకరమన్నారు. పుట్టెడు దుఃఖంలోనూ తల్లిదండ్రులు యువంత్ అవయవదానానికి ముందుకు రావడం ఆదర్శనీయమన్నారు. రేర్ కేసుల్లో కూడా ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు ప్రభుత్వ వైద్యాధికారులకు సమాచారం ఇవ్వడంలో జాప్యం చేయడం తగదన్నారు. గ్రామంలో నీటి సామర్థ్య పరీక్షలు నిర్వహించి, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ఇంటింటా సర్వే చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. అంతకు ముందు సర్పంచ్ అంగ లక్ష్మి, జనార్దన్, మల్లేష్‌లు మాట్లాడుతూ గ్రామానికి 104 సేవలు అందించాలని, 108 వాహనం కాల్ చేసిన వెంటనే రావడంలేదని ఫిర్యాదు చేశారు. కిడ్నీ వ్యాధులతో గతంలో 9 మంది మృతి చెందారని, మరో ఐదుగురు వ్యాధితో బాధపడుతున్నారని గ్రామానికి చెందిన కె.శివప్రసాద్ డీఎంహెచ్‌ఓ దృష్టికి తీసుకురాగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మేరీ కేథరిన్, డీపీఎంవో వాన సురేష్‌కుమార్, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ రవీంద్ర, డీజీపురం పీహెచ్‌సీ డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



### ఇంద్రుడు.. చంద్రుడు

ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం ప్రధాన దేవాలయం ఆవరణలో ఉన్న ఇంద్రేశ్వర ఆలయం శిఖరాన్ని బుధవారం మాఘ పౌర్ణమి సందర్భంగా చంద్రుడు అలంకరించి కనువిందు చేశాడు. ఈ దృశ్యం చూసిన భక్తులు పరవశించిపోయారు. -జలుమూరు

# కల్యాణం.. కమనీయం!

- కనులపండువగా వేణుగోపాలుని కల్యాణోత్సవం
- శాలిహుండం గిరిపై మాఘ పౌర్ణమి సందడి

గార:

శ్వేతగిరిపై కొలువుదీరిన కాళీయమర్దన వేణుగోపాలుడి కల్యాణోత్సవం బుధవారం కనులపండువగా సాగింది. మాఘ శుద్ధ సప్తమి మొదలుకొని తొమ్మిది రోజుల పాటు జరిగిన యాత్రోత్సవంలో భాగంగా మాఘ శుద్ధ పౌర్ణమి వేళలో రుక్మిణీ సత్యభామ సమేత కాళీయ మర్దన వేణుగోపాలుని కల్యాణోత్సవంతో పాటు శ్రీలక్ష్మీ, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక కల్యాణ మంటపంలో ఇరువురు మూర్తులను వేంచింపజేసిన బంకపల్లి నాగరాజుశర్మ, మహేంద్రాడ సాయి శర్మ, రవిశర్మ, సంతోష్ శర్మ, ఉగ్రనరసింహాచార్యులు, కూర్మరాజాచార్యుల బృందం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించింది. ముందుగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పరిషత్ కంకణధారణ, శతమాన ధారణ, అష్ట దిక్పాలక ఆరాధన, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం అవబృధ స్నానం నిర్వహించారు. ఆలయ ట్రస్టీ సుగ్గు మధురెడ్డి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలును సమర్పించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కె.శ్రీనివాస్, కె.సుభాష్, పల్లి నర్సింహులు, సుగ్గు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి సన్నిధిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



కల్యాణోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే గొండు శంకర్

### వేణుగోపాలుడి సన్నిధిలో ధర్మాన కృష్ణదాస్

శ్వేతగిరిపై కాళీయ మర్దన వేణుగోపాల స్వామిని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయన్ను ఆలయ అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి దంపతులు స్వాగతం పలికారు. ఆయన వెంట నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళీధర్, జెడ్పీటీసీ సభ్యుడు చింతు రామారావు, పొందర కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజాపు అప్పన్న, పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బగ్గు రమణయ్య, అటవీ శాఖ మాజీ డైరెక్టర్ బొబ్బాది ఈశ్వరరావు, తోట భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు

గార: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బుధవారం అంపోలు వద్ద జిల్లా జైలును సందర్శించారు. మహిళా ఖైదీలతో మాట్లాడి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జైలర్ దివాకర్‌నాయుడు, డీపీఎం ఆదిలింగం, ప్రిజన్ ప్రోగ్రామర్ పి.దేవి తదితరులు పాల్గొన్నారు.

### యాత్ర ముగిసింది.. యాతన మిగిలింది..



గార మండలం శాలిహుండంలో కాళీయ మర్దన వేణుగోపాలస్వామి జాతర పూర్తయి ఐదు రోజులు కావస్తున్నా తొలి మెట్టు వద్ద ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. రద్దీ దృష్ట్యా చాలామంది భక్తులు తొలి మెట్టు వద్దే కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకుంటారు. మిగిలిన వారు చెప్పులు అక్కడే వదిలేసి కొండపైకి వెళ్తుంటారు. ఈ క్రమంలో ఆ ప్రాంతమంతా చెప్పులు, కొబ్బరి వ్యర్థాలు, పాలిథిన్ కవర్లతో అస్తవ్యస్తంగా మారి దుర్వాసన వస్తోంది. - గార

## క్లుప్తంగా

### అర్చకుడిపై దాడి అమానుషం


కృష్ణ శర్మ

రణస్థలం: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడి అమానుషమని ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మేడూరి కృష్ణశర్మ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటన పురోహిత వ్యవస్థపైనే కాకుండా, హిందూ సమాజంపై జరిగిన దాడిగా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. దాడికి కారణమైనవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### చోరీ కేసులను ఛేదించాలి


ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: చోరీ కేసులను సమగ్ర దర్యాప్తుతో త్వరితగతిన ఛేదించి ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వర్చువల్ విధానం ద్వారా డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో చైన్‌స్నాచింగ్, వాహనాల చోరీ, ఆలయాల దొంగతనాలు, పగటిపూట, రాత్రి సమయంలో జరిగే నేరాలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలపై సమీక్షించారు. అపరిష్కృతంగా ఉన్న కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో డీసీఆర్‌బీ సీఐ శ్రీనివాసరావు, సైబర్ సెల్ సీఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ధనలక్ష్మి ఫిర్యాదుపై విచారణ పూర్తి

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో ఉద్యోగమిస్తామని మోసం చేసిన వైనంపై బాధితురాలు ఎస్.ధనలక్ష్మి చేసిన ఫిర్యాదుపై విచారణ బుధవారం పూర్తయ్యింది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖాధికారుల ఆదేశాల మేరకు విశాఖపట్నం డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు విచారణాధికారిగా హాజరై బాధితురాలితో పాటు విచారణ నోటీసులు అందుకున్న ఏడుగురు సిబ్బంది నుంచి వాంగ్మూలాన్ని స్వీకరించారు. ప్రధానంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ జి.వి.నరసింహం మాత్రం విచారణకు హాజరుకాలేదని సమాచారం. కాగా, ధనలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేవలం సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ జి.వి.నరసింహంలను మాత్రమే విచారణ చేయాలని, ఎటువంటి ప్రమేయం లేని తమకు విచారణ నోటీసులు ఇవ్వడం ఏంటని ఏఓ బాబూరావు, ఉద్యోగులు నారాయణరావు, రామచంద్రరావు తదితరులు విచారణాధికారికి నివేదించారని తెలిసింది. అనంతరం బాధితురాలు ఎస్.ధనలక్ష్మి మాట్లాడుతూ తన తల్లి సునీతతో కలిసి వాంగ్మూలాన్ని అందజేశానని, అన్ని వివరాలకు ఆధారాలతో సహా తెలియజేశానని చెప్పారు. తనకు ఉద్యోగం పేరిట డబ్బులు తీసుకుని మోసం చేసినది సూపరింటెండెంట్ భాస్కర్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ జి.వి.నరసింహంలే అని...నోటీసులో పేర్కొన్న మిగిలిన ఉద్యోగులు ఎవరో తనకు తెలియదని వివరించినట్లుగా పేర్కొన్నారు. అప్పట్లో తమ ఫిర్యాదుపై నిర్లక్ష్యం వహించిన అప్పటి డీఎంహెచ్‌వో మీనాక్షిని ఎందుకు విచారణకు పిలువలేదని బాధితురాలు ప్రశ్నించినట్లుగా తెలిసింది. కాగా, నివేదికను ప్రభుత్వానికి అందించనున్నట్లు అధికార వర్గాలు తెలియజేశాయి.

# నాట్య మయూరి..!


సర్వజ్ఞ శంకర బాలెలో యామిని

- కూచిపూడిలో సత్తాచాటుతున్న యామిని
- 500లకు పైగా ప్రదర్శనలు
- ఎన్నో అవార్డులు, మరెన్నో పురస్కారాలు

శ్రీకాకుళం కల్చరల్:

తను గజ్జె కడితే చూడడానికి రెండు కళ్లు చాలవు. కాలు కదిపితే నెమలి పురివిప్పి నాట్యం చేస్తోందా అన్నట్లుంటుంది. దేశ, విదేశాల్లో ప్రదర్శనలతో ఎంతోమంది మన్ననలు పొందింది. పట్టుదల ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికి వెళ్లవచ్చని నిరూపిస్తోంది. ఆశయ సాధనతో ముందుకు సాగుతున్న ఆ నాట్య మయూరి శ్రీకాకుళం పట్టణానికి చెందిన కాశిరెడ్డి వెంకట యామిని. పట్టణంలోని దండివీధికి చెందిన కె.సత్యనారాయణ, కనక మహాలక్ష్మిల కుమార్తె యామిని. తన చిన్నతనం నుంచి నాట్యంపై మక్కువతో తొమ్మిదేళ్ల వయస్సులో తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సాధారణ నృత్యాలు నేర్చుకుంది. అనంతరం శ్రీకాకుళం నాట్యాచారిణి స్వాతీ సోమనాథ్ వద్ద కూచిపూడి గురుకులంలో నాట్య విద్యను అభ్యసించింది. తదుపరి అక్కడే ఫ్యాకల్టీగా కూడా పనిచేసింది. అలాగే రేవా యూనివర్సిటీలో కూచిపూడిలో డిప్లొమో, ఏయూలో ఎంఏ కూచిపూడి పూర్తి చేసింది. అలాగే యూకే, మలేషియా వంటి దేశాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చింది.

### ముఖ్యమైన అవార్డులు

యామిని ప్రదర్శనలు ఇచ్చిన అన్నిచోట్లా ఎన్నో ప్రశంసలు, అవార్డులు అందుకుని తన ప్రతిభను మరింత మెరుగుపరుచుకుంది. 2023లో రిపబ్లిక్ డే అవార్డును, కళాభారతి అవార్డును, సింగపూర్‌లో జరిగిన కూచిపూడి సీనియర్ కేటగిరీ పోటీల్లో ద్వితీయ బహుమతిని పొందింది. ప్రసార భారతి దూరదర్శన్ కేంద్రంలో బీ–గ్రేడ్ ఆర్టిస్టుగా, కళోత్సవం జిల్లా స్థాయి పోటీల్లో జ్యూరీ సభ్యులుగా పనిచేసింది.



### ఎన్నో మెలకువలు నేర్చుకున్నా

నాకు చిన్నతనం నుంచి నృత్యం అంటే చాలా ఇష్టం. నా గురువు స్వాతీ సోమనాథ్ నుంచి ఎన్నో కొత్త అంశాలు, మెలకువలు నేర్చుకున్నాను. అలాంటి గురువు, ఎంతో సహకారం అందించిన తల్లిదండ్రులు ఉండడం నా అదృష్టం. నా తండ్రి మృతి చెందినా మా తల్లి ఎంతగానో ప్రోత్సాహించారు. విదేశాల్లో ప్రదర్శనలు ఇవ్వడం నా జీవితంలో గొప్ప విషయం.

– కె.యామిని, ఫ్యాకల్టీ, కూచిపూడి గురుకులం

### ఎన్నో ప్రదర్శనలు

యామిని కూచిపూడిలో దాదాపు 500లకు పైగా నాట్య ప్రదర్శనలు ఇచ్చి ఎంతోమంది మన్ననలు పొందింది. కిన్నెరసాని, ద్రౌపది, కామసూత్ర, సర్వజ్ఞశంకర బాలెలను లండన్, మాంచెస్టర్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చింది. తిరుమలలో నాదనీరాజనం, భోపాల్, నాగ్‌పూర్, విశాఖపట్నం కోటి దీపోత్సవాల్లో, సిలికాన్ ఆంధ్రావారి గిన్నీస్ బుక్ ఆఫ్ రికార్డులో, విశాఖ ఉత్సవ్, దూరదర్శన్‌లో, హైదరాబాద్ శిల్పారామం తదితర చోట్ల ప్రదర్శనలు ఇచ్చింది. అలాగే స్వాతీ సోమనాథ్ కూచిపూడి నృత్యం ప్రపంచమంతా తెలియాలనే ఉద్దేశంతో ధర్మో రక్షతి రక్షితః 'వీధినాటకం' ప్రదర్శనలో భాగంగా విజయనగరం జిల్లా పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద ప్రదర్శన చేసింది. అదేవిధంగా అరుణాచలేశ్వరస్వామి ఆలయ గిరి ప్రదక్షిణ అంతా నృత్యం చేస్తూ, కాశీలో కాశీ గంగా ఘాట్ వద్ద, కాశీ ఆలయంలో, హిమాలయాల్లోని లేహ–లడక్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చింది.

## వెయిట్‌లిఫ్టర్ ధనుంజయ మృతి


ధనుంజయ(ఫైల్)

నందిగాం: మండలంలోని శివరాంపురం గ్రామానికి చెందిన వెయిట్‌లిఫ్టర్ ఇప్పిలి ధనుంజయ(44) అనారోగ్యంతో బుధవారం వేకువజామున మృతి చెందాడు. గత కొద్ది రోజులుగా ఆయన కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. జిల్లాస్థాయిలో జరిగే సంగిడి రాళ్లు, ఉలవల బస్తాలు ఎత్తే పోటీల్లో, వెయిట్ లిఫ్టింగ్‌లో అనేక బహుమతులు అందుకున్నారు. ధనుంజయ మొదటి భార్య శార్వాణి క్యాన్సర్‌తో మృతి చెందగా, లక్ష్మీ అనే మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. అతడికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన మృతిపై గ్రామస్తులు, పలువురు క్రీడాకారులు సంతాపం వ్యక్తం చేశారు. అంతిమ యాత్రలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కురమాన బాలకృష్ణారావు, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు చిన్నిజోగారావు, అంబోడి విష్ణు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

### కోడ్ కొందరికేనా?



ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో అధికారులు పక్షపాతం వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాకుళం నగర ప్రధాన రహదారిలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద కొత్త బ్రిడ్జిని ఆనుకుని కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడుల కటౌట్ ఉన్నా ముసుగులు వేయలేదు. దీంతో అధికార పార్టీకి ఒకలా, ప్రతిపక్ష పార్టీలకు ఒకలా వ్యవహరించడం అధికారులకు తగదని పలువురు మండిపడుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

### మెమోలు జారీ చేయండి

గార: ఉపాధి వేతనదారులను నిర్దేశించిన లక్ష్యం మేరకు పని కల్పించని క్షేత్ర సహాయకులకు మెమోలు జారీ చేయాలని డ్వామా పీడీ బి.సుధాకరరావు అధికారులను ఆదేశించారు. బుధవారం గార ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పనుల కల్పనపై జాప్యం చేయవద్దన్నారు. సమావేశంలో ఏపీవో సంధ్యారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

### టీ హౌస్‌లో అగ్ని ప్రమాదం

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులోని నివగాం రోడ్డులో ఉన్న గోగుల రామారావు నాయుడు షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన సల్ల సన్యాసిరావుకు చెందిన టీ హౌస్‌లో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. టీ హౌస్‌లో విద్యుత్ షార్టు సర్క్యూట్ జరగడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న స్థానిక అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

### మద్యం తాగవద్దన్నందుకు ఆత్మహత్య

గార: మద్యం తాగవద్దని భార్య మందలించడంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కొలుసు లక్ష్మణ(49) బుధవారం గ్రామ సమీపంలోని మామిడితోటలో ఒక చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి భార్య ఆదిలక్ష్మికి సమాచారమిచ్చారు. మంగళవారం రాత్రి మద్యం తాగవద్దని భార్య చెప్పడంతో వారి మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తోంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సహాయకులపై చిన్నచూపు

- కిడ్నీరోగులతో వచ్చేవారికి సదుపాయాలు కరువు

కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వ కిడ్నీ పరిశోధన కేంద్రం, డయాలసిస్ యూనిట్ వద్ద డయాలసిస్ కోసం వచ్చిన కిడ్నీ రోగులకు, వారి సహాయకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ షిఫ్టులలో డయాలసిస్ సేవల కోసం వస్తున్నవారికి కనీస మౌలిక సదుపాయాలు అందడం లేదు. డయాలసిస్ పూర్తవ్వడానికి సుమారు నాలుగు గంటల సమయం పడుతున్న తరుణంలో, రోగితో వచ్చిన సహాయకులకు కనీసం కుర్చీలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. దీంతో కిందనే కూర్చున్నవారు కొందరైతే, మరికొందరు డయాలసిస్ పూర్తయ్యేవరకు నిలబడే ఉంటున్నారు. ఈ డయాలసిస్ యూనిట్‌ను నెఫ్రోప్లస్ సంస్థ వారు నడుపుతున్నారు. ఇక్కడ 3 షిఫ్టులలో రోజుకు 86 మందికి డయాలసిస్ చేస్తున్నారు. రోజుకు రోగులు, వారి సహాయకులు సుమారు 180 నుంచి 200 మంది వరకు వస్తుంటారు. దీంతో అటువంటి వారికి ఇక్కడ సౌకర్యాలు కల్పించాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.


సహాయకుల వద్ద పనిచేయని ఫ్యాన్


కుర్చీలు లేకపోవడంతో నిలబడి ఉన్న సహాయకులు

## వరుస దొంగతనాలతో ఆందోళన


కంచిలి: మండలంలో ఇటీవల వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తాజాగా మంగళవారం రాత్రి కంచిలి ఏపీజీవీబీ శాఖ ఎదురుగా మేడమీద అద్దె ఇంట్లో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు త్రిలోచన పొల్లాయికి చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే.. త్రిలోచన పొల్లాయి ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని ఏపీజీవీబీ బ్రాంచ్ ముందరి భాగంలో పార్క్ చేశాడు. అయితే ఉదయం లేచి చూసేసరికి లేకపోవడంతో లబోదిబోమన్నాడు. వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదిలా ఉండగా ఈ మధ్యకాలంలో మరో మూడు బైక్‌లు చోరీకి గురయ్యాయి. దీంతో బాధితులంతా ఏం జరుగుతోందో అర్థం కావడం లేదని వాపోతున్నారు. మరోవైపు ఆదివారం సంత ప్రాంతంలో ప్రతివారం సంత జరిగే సమయాల్లో సెల్‌ఫోన్లు ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి. దీంతో పోలీసులు ఈ ఘటనలపై ప్రత్యేక దృష్టి సారించి దొంగలను పట్టుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## సమస్యలు పరిష్కరించేవారికే మద్దతు


మాట్లాడుతున్న దుగ్గివలస రాంప్రసాద్

పొందూరు: రాష్ట్రంలోని కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కృషిచేసే ఎమ్మెల్సీ అభ్యర్థులకే తమ మద్దతు ఉంటుందని కాంట్రాక్ట్ లెక్చరర్స్ సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి దుగ్గివలస రాంప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలనుద్దేశించి మాట్లాడారు. 25 ఏళ్ల తమ సుదీర్ఘ సర్వీసుల ప్రస్థానంలో ఎటువంటి ఉద్యోగ భద్రతకు నోచుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ విషయంలో పాలకులు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చట్టం యాక్ట్ నంబర్ 30/2023 ప్రకారం, జీవో నంబర్ 114 అనుసరించి సర్వీసుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తిచేసినప్పటికీ, నియామక ఉత్తర్వుల జారీకి ఎన్నికల కోడ్ అడ్డంకిగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడిచినప్పటికీ క్రమబద్ధీకరణ ఉత్తర్వుల విషయంలో స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంతో చర్చించేందుకు చిత్తశుద్ధి కలిగిన అభ్యర్థికే తాము అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు డాక్టర్ అచ్యుతరావు, పాట్నూరు రమేష్, శ్రీనివాసారావు, దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

### ఆపరేషన్ 'కగార్'ను వెంటనే ఆపాలి



మాట్లాడుతున్న బాలకృష్ణ

పలాస: దండకారణ్యంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా కమిటీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పలాస మండలం బొడ్డపాడులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ బీజాపూర్‌లో జరిగింది బూటకపు ఎన్‌కౌంటరని పేర్కొన్నారు. అక్కడ 31 మంది మావోయిస్టులు మృతి చెందారని చెబుతున్నారని, వాస్తవానికి అందులో ఎంతమంది గిరిజనులు ఉన్నారో తెలియదన్నారు. ఆ మృతులు ఎవరనేది కూడా ప్రభుత్వం ప్రకటించలేదని చెప్పారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఇటువంటి పోలీసు దాడులను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. దండకారణ్యంలోని ప్రకృతి సంపదను, ఖనిజ సంపదను కార్పొరేటు సంస్థలకు అప్పగించడానికి పెద్దకుట్ర జరుగుతోందని, అందులో భాగంగానే గిరిజనులపై దాడులు జరుగుతున్నాయని, వీటిని పౌర సమాజం కూడా ఖండించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ, ప్రగతిశీల యువజన సంఘం నాయకుడు సార జగన్, రాపాక మాధవరావు, పోతనపల్లి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



తీవ్రగాయాలతో ఉన్న సతీష్

టెక్కలి రూరల్: మండలంలోని కిట్టాలపాడు జంక్షన్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాతపట్నం మండలం నల్లబొంతు గ్రామానికి చెందిన మామిడిపల్లి సతీష్, మామిడిపల్లి సంతోష్‌లు తమ ద్విచక్ర వాహనంపై నరసన్నపేట వెళ్లి, తిరిగి మెళియాపుట్టి ప్రయాణమయ్యారు. అదే సమయంలో కిట్టాలపాడు సమీపంలోని రాంపురం గ్రామానికి చెందిన సువ్వారి శ్రీధర్ తన క్వారీ పనులు ముగించుకుని సైకిల్‌పై తన ఇంటికి వెళ్తుండగా, కిట్టాలపాడు జంక్షన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై వచ్చినవారు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరితో పాటు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తికి సైతం తీవ్రగాయాలయ్యాయి. దీంతో ముగ్గురినీ హుటాహుటిన టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వీరిలో మామిడిపల్లి సతీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించనున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.

### పుస్తెలతాడు చోరీ

నందిగాం: మండలంలోని దేవుపురం పంచాయతీ కొండతెంబూరులో బుధవారం ఉదయం ఒక మహిళ పుస్తెల తాడు చోరీకి గురయ్యింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కణితి రిశాంతి బుధవారం ఉదయం 6 గంటలకు జాతీయ రహదారి పక్కనున్న తాగునీటి బోరు వద్దకు నీరు పట్టేందుకు వెళ్లింది. అక్కడ నీరు పడుతున్న సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు పుస్తెలతాడును తెంపుకొని వెళ్లిపోయారు. అకస్మాత్తుగా జరిగిన ఈ పరిణామం నుంచి తేరుకున్న రిశాంతి కేకలు వేసినా ఫలితం లేకపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నందిగాం పోలీస్ స్టేషన్ హెచ్‌సీ డిల్లేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ఆయన నేత్రాలు సజీవం


పాట్నూరు శ్రీనివాసరావు

శ్రీకాకుళం కల్చరల్ : హయాతినగర్‌లోని సత్యనగర్ కాలనీలో నివాసముంటున్న పాట్నూరు శ్రీనివాసరావు(61) మృతి చెందడంతో ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుటుంబసభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా.. నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత, సహాయకులు నంది ఉమాశంకర్‌లు కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులు మణికంఠ, గిరికుమారి, రవికుమార్, సంతు, చక్ర, గోవిందరాజులను రెడ్‌క్రాస్ ప్రతినిధులు అభినందించారు.


## యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

రీజనల్ ఆఫీస్, ఇ.నెం.8, సింహద్వారం ఆర్చ్ దగ్గర, వెంకటాపురం, శ్రీకాకుళం జిల్లా. ఫోన్ : 08942 - 270919.

### ఇ-వేలం అమ్మకం ప్రకటన (స్థిరాస్తుల అమ్మకం కొరకు)

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ప్రకారం స్థిరాస్తుల 15 రోజుల అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకమునకు ఋణగ్రహీత/లు మరియు హామీదారు/లు తెలియజేయునది ఏమనగా ఈ క్రింద తెలియజేయబడిన స్థిరాస్తులు బ్యాంకునకు తనఖా ఉంచి పొందిన ఋణము తిరిగి చెల్లించుటలో విఫలమైనందున యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు స్వాధీనం చేసుకున్నారు. సదరు ఆస్తులను యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారి వారు బకాయి సొమ్మును ఋణగ్రహీత/లు మరియు హామీదారు/లు నుండి తిరిగి రాబట్టుకునేందుకు సదరు ఆస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" అనే పద్ధతిపై దిగువ తెలిపిన బకాయి సొమ్ములను మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలను రాబట్టుకొనుటకు ఋణదాత అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు తేది.28.02.2025న సదరు ఆస్తులను ఇ-వేలం ద్వారా అమ్మకం చేయుదురని తెలియజేస్తూ ఈ నోటీసు జారీ చేయబడినది.

1 కళింగ రోడ్డు బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా — ఫోన్ : 08942 - 222054

ఋణగ్రహీతలు: 1. మెస్సర్స్ అముక్త మెడిసిన్ హౌస్, ప్రొప్రైయిటర్ : కె.బి. గీతారాణి, షాప్ చిరునామా: డి.నెం.9-7-12, రిక్షా స్టాండ్ దగ్గర, గుడి వీధి, శ్రీకాకుళం జిల్లా - 532001. 2. ప్రొప్రైయిటర్ : కె.బి. గీతారాణి, భర్త : ఎమ్ఎవిటి చక్రవర్తి, ఇ.నెం.9-7-78/ఎ, గుడి వీధి, రిక్షా స్టాండ్ దగ్గర, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532001. 3. శ్రీ మరువాడ అనంత వెంకట శ్రీనివాస్, తండ్రి : రామకృష్ణాచార్యులు, ఇ.నెం.9-7-78, గుడి వీధి, శ్రీకాకుళం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532001.

బకాయి మొత్తం : తేది.31.12.2024 నాటికి రూ.22,30,260.44 పై (అక్షరాల ఇరవై రెండు లక్షల ముప్పై వేల రెండు వందల అరవై రూపాయల నలభై నాలుగు పైసలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

స్థిరాస్తి వివరములు: ఐటమ్ నెం.1: శ్రీకాకుళం, శ్రీకాకుళం టౌన్, మున్సిపాలిటీ, సబ్ డివిజన్, కోటేశ్వరస్వామి వార్డు, గుడి వీధి నుండి దమ్మల వీధి రోడ్డు యొక్క ఉత్తరం వైపు, గుడి వీధి, కొత్త అసెస్మెంట్ నెం.1085003156, పాత అసెస్మెంట్ నెం.2308ఇ (4871), డి.నెం.9-7-78, టి.ఎస్.నెం.29 వద్ద 69.446 చ॥గజాల విస్తీర్ణం గల నివాస భూమి మరియు భవనం యావత్తు ఆస్తి శ్రీ మరువాడ అనంత వెంకట శ్రీనివాస్, తండ్రి : రామకృష్ణాచార్యులు గారికి చెందినది. కొలతలు : తూర్పు నుండి పడమర : 11 అ॥ల 10 ఇంచులు (3.61 మీ॥లు), ఉత్తరం నుండి దక్షిణం : 52 అ॥ల 10 ఇంచులు (16.11 మీ॥లు). ఆస్తి హద్దులు: తూర్పు : దూసా రమణమ్మ మరియు ఈ ఆస్తి యొక్క ఉమ్మడి గోడ, పడమర : బొంతా భాస్కరరావు మరియు ఈ ఆస్తి యొక్క ఉమ్మడి గోడ, ఉత్తరం : దారి మరియు ఉపయోగ కరమైన నీరు, వర్షపు నీటి కొరకు గల డ్రైనేజీ (1/5 వాటా) ఉమ్మడి ప్రదేశం, దక్షిణం : దమ్మల వీధికి పోవు మున్సిపల్ రోడ్డు.

ఐటమ్ నెం.2: 4.56 చ॥గులు లేదా 3.82 చ॥మీ॥ల విస్తీర్ణంలో టాయిలెట్స్‌తో గల భూమి. కొలతలు : తూర్పు నుండి పడమర: 8 అ॥ల 6 ఇంచులు (2.60 మీ॥లు), ఉత్తరం నుండి దక్షిణం : 4 అ॥ల 10 ఇంచులు (1.48 మీ॥లు). ఆస్తి హద్దులు: తూర్పు : నక్కా కనకయ్య గారి ఉమ్మడి గోడ, పడమర : డ్రైనేజీ కొరకు గల ఉమ్మడి దారి, ఉత్తరం : దూసా రమణమ్మ గారి టాయిలెట్ ప్రదేశం, దక్షిణం : బిట్నూరి పద్మావతి గారి టాయిలెట్ ప్రదేశం.

రిజర్వు ధర : రూ.25.50 లక్షలు | ధరావత్తు : రిజర్వు ధరలో 10% | బిడ్ పెంపుదల మొత్తం:రూ.30,000/-

2 హరిపురం బ్రాంచ్, శ్రీకాకుళం జిల్లా — ఫోన్ : 9137129621

ఋణగ్రహీతలు: 1. ఎజ్జి నారాయణరావు, తండ్రి : ఎజ్జి పాపయ్య (లేటు), డోర్ నెం.1-91, ఎస్ సి కాలనీ, టెక్కలిపట్నం గ్రామం, పలాస మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532220. 2. ఎజ్జి శేషాదేవి, భర్త: ఎజ్జి నారాయణ రావు, డోర్ నెం.1-91, ఎస్ సి కాలనీ, టెక్కలిపట్నం గ్రామం, పలాస మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532220.

బకాయి మొత్తం : తేది.29.12.2023 నాటికి రూ.12,73,861.43 పై (అక్షరాల పన్నెండు లక్షల డెబ్బై మూడు వేల ఎనిమిది వందల అరవై ఒక్క రూపాయల నలభై మూడు పైసలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

స్థిరాస్తి వివరములు: శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, టెక్కలిపట్నం గ్రామం & పంచాయితీ, ఎస్ సి వీధి, ఎమ్‌పిపి స్కూల్ & చాపర రోడ్డు దగ్గర, అసెస్మెంట్ నెం.131, సర్వే నెం.65/2 లోని 202.22 చ॥గజాల విస్తీర్ణంలో గల భూమి మరియు భవనం (నివాస) యావత్తు ఆస్తి ఎజ్జి శేషా దేవి గారికి చెందినది. హద్దులు : తూర్పు : బసకల మల్లేశు గారి ఇల్లు, పడమర : బసకల అప్పారావు గారి ఇల్లు, ఉత్తరం : రోడ్డు, దక్షిణం : రోడ్డు.

రిజర్వు ధర : రూ.10.10 లక్షలు | ధరావత్తు : రిజర్వు ధరలో 10% | బిడ్ పెంపుదల మొత్తం:రూ.10,000/-

3 ఋణగ్రహీతలు: 1. శ్రీ ఇప్పిలి రమేష్, తండ్రి : లేటు కృష్ణారావు, ఇ.నెం.1-300, ఎస్ సి వీధి, మాలపేట, తర్ల గూడూరు గ్రామం, గరుడభద్ర పోస్ట్, వజ్రపుకొత్తూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532222. 2. శ్రీమతి ఇప్పిలి రాణి, భర్త : ఇప్పిలి రమేష్, ఇ.నెం.1-300, ఎస్ సి వీధి, మాలపేట, తర్ల గూడూరు గ్రామం, గరుడభద్ర పోస్ట్, వజ్రపుకొత్తూరు మండలం, శ్రీకాకుళం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 532222.

బకాయి మొత్తం : తేది.29.12.2023 నాటికి రూ.10,10,128.47 పై (అక్షరాల పది లక్షల పదివేల నూట ఇరవై ఎనిమిది రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే) + వడ్డీ మరియు ఇతర ఛార్జీలు మొదలగునవి.

స్థిరాస్తి వివరములు: శ్రీకాకుళం జిల్లా, వజ్రపు కొత్తూరు మండలం, గరుడభద్ర పంచాయితీ మరియు పోస్ట్, తర్ల గూడూరు గ్రామం వద్ద సర్వే నెం.31/9బి లోని 73.33 చ॥గజాల విస్తీర్ణంలో గల భూమి మరియు భవనం (నివాస) యావత్తు ఆస్తి శ్రీ ఇప్పిలి రమేష్ గారికి చెందినది. హద్దులు: తూర్పు : గనియా ఎర్రయ్య గారి ఆర్‌సిసి ఇల్లు, పడమర : దుక్కా పున్నయ్య గారి ఆర్‌సిసి ఇల్లు, ఉత్తరం : వీధి రోడ్డు, దక్షిణం : రోడ్డు.

రిజర్వు ధర : రూ.9.50 లక్షలు | ధరావత్తు : రిజర్వు ధరలో 10% | బిడ్ పెంపుదల మొత్తం:రూ.10,000/-

బ్యాంకు వారికి తెలిసిన తాకట్టు ఋణ భారములు : లేవు

ఇ-వేలం తేది మరియు సమయం : 28-02-2025, మ॥ 12.00 గం॥ల నుండి సా॥ 05.00 గం॥ వరకు (వేలము పూర్తి అగు వరకు 10 నిముషముల చొప్పున సమయం పొడిగించబడును)

ఆస్తుల విక్రయమునకు సంబంధించిన పూర్తి వివరములు మరియు నిబంధనల కొరకు, దయచేసి https://baanknet.com మరియు వెబ్‌సైట్ www.unionbankofindia.co.in నందు చూడగలరు.

తేది : 10.02.2025
స్థలం : శ్రీకాకుళం

సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రీజనల్ ఆఫీస్, శ్రీకాకుళం



## సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 8919613984 [HA-99808]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం, జీ: 18K. Ph: 9160900024, 9640400073 [HA-1400]

■ మర్చంట్ నేవీలో Cruise Shipsలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు, విభాగం అన్ని డిపార్టుమెంట్స్, వ : 18-27, Qly : 10th & అబోవ్ లాయిడ్స్ మ్యారిన్ సర్వీసెస్ Pvt. Ltd, Hyd. T.G., కోయంబత్తూరు(TN) 7675982065 [SCA25001657]

### గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.